లలిత సంగీత పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో 25వ ఏవీ సావిత్రి స్మారక లలిత సంగీత పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త యుహెచ్ సత్య వాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వయస్సు ఆధారంగా సీనియర్లు, జూనియర్లు, సబ్ జూనియర్‌ర్లుగా విభజించి ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. సినిమా పాటలను అనుమతించమని, విజేతలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు, నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు తెలుగు, హిందీ భాషల్లో లలిత గీతాలను పాడాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చిక్కడపల్లిలోని తమ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను పొందవచ్చునని వివరాలకు 9515413349, 9441063911 నంబర్‌లలో సంప్రదించాలన్నారు. ప్రముఖ లలిత సంగీత విద్యాంసులు డాక్టర్ ఎం.చిత్తరంజన్‌కు నివాళిగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

టెక్నాలజీ కాలేజీ హాస్టల్ సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్ మంగళవారం అధికారులను కోరారు. హాస్టల్‌లో గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు, నాణ్యతలేని ఆహారం, అధిక మెస్ బిల్లులు, తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని రవినాయక్ పేర్కొన్నారు.

బాధ్యులకే బాధ్యతలు..

పాత ప్రచార పద్ధతులకు బీఆర్ఎస్ స్వస్తి

- కొత్తగా డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం
- ప్రతి డివిజన్‌కు 10 మందితో కమిటీ
- అవసరమైతే క్లస్టర్ ఇన్‌చార్జిలు
- బూత్ దాటి రావద్దంటూ కేడర్‌కు ఆదేశాలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటి వరకు అనుసరిస్తున్న పాత ప్రచార పద్ధతులకు స్వస్తి పలికినట్లు కనిపిస్తోంది. ఇప్పటి వరకు 2–3 రోజులు మాత్రమే పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ఇకపై పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. అందులో భాగంగానే వివిధ స్థాయిల్లో ఎలక్షన్ కమిటీలను వేసి వాటి ద్వారానే కార్యక్రమాలను నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు పార్టీ సీనియర్ల సేవలను కూడా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. పాత డివిజన్ కమిటీలను ఈ నెల రోజులు పక్కన పెట్టాలని భావిస్తున్నారు.

ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం...

ప్రస్తుతం నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లు ఉండగా పార్టీ సౌలభ్యత కోసం రాంనగర్, కవాడిగూడలను రెండు భాగాలుగా విభజించి మొత్తం 8 డివిజన్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు ఇద్దరు చొప్పున ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించారు.

10 మందితో కమిటీ....

ఇక పాత డివిజన్ కమిటీ, బస్తీ కమిటీలతో సంబంధం లేకుండా ప్రతి డివిజన్‌లో పది మందితో ఎలక్షన్ కమిటీని వేయాలని నిర్ణయించారు. ఇందులో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్‌కు చెందిన అన్ని గ్రూప్‌లకు చెందిన నేతలకు అవకాశం కల్పించనున్నారు. ఈ కమిటీ ద్వారానే ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తారు.

అవసరమైతే క్లస్టర్ ఇన్‌చార్జిలు...

ఇప్పటికే ప్రతి బూత్‌లో కమిటీలను వేసిన పార్టీ బూత్ కమిటీల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 2–3 బూత్‌లను కలిపి ఒక క్లస్టర్ ఇన్‌చార్జీలను వేయాలని కూడా నాయకులు భావిస్తున్నారు.

బూత్ దాటి రావొద్దు..

నియోజకవర్గంలోని బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు తమతమ బూత్‌ల నుంచి బయటకు రావద్దని ప్రతి రోజు ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా బూత్ ఇన్‌చార్జిలు రోజుకు ఎంత మందిని కలుస్తున్నారు అనేది పర్యవేక్షిస్తున్నామని ఈ నెల రోజులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇక డివిజన్ ఇన్‌చార్జిలు పోలింగ్ బూత్‌ల పనితీరు, సీనియర్లను కలుపుకొని పోవడం వేరే పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరే వారిని ప్రోత్సహించడం నాయకుల మధ్య సమన్వయం చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

డివిజన్	ఇన్‌చార్జిలు
1. అడిక్‌మెట్	ఇంద్రసేనారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్.
2. ముషీరాబాద్	కొండపల్లి మాధవ్, సిద్ధా శ్రీశైలంయాదవ్.
3. బాగ్‌లింగంపల్లి	జెల్లా భిక్షపతి, శివముదిరాజ్.
4. గాంధీనగర్	బొట్టు శ్రీనివాస్, అజయ్‌ముదిరాజ్.
5. భోలక్‌పూర్	పరశురాం, బల్వీర్‌కుమార్.
6. దోమలగూడ	మల్లికార్జున్‌రెడ్డి, శ్రీధర్‌చారి.
7. రాంనగర్	రంజన్‌నాయుడు, భక్తియార్ అహ్మద్.
8. కవాడిగూడ	కోకానవీన్, జునేద్ బాగ్దాది.

బీజేపీ రెబల్ అభ్యర్థిగా స్నేహారెడ్డి నామినేషన్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాంరెడ్డి స్నేహారెడ్డి మంగళవారం ఎన్నికల అధికారి వి.లక్ష్మీ నారాయణకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధి కోసం గత 20 ఏళ్లుగా నిజాయితీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ ముషీరాబాద్‌లో పోటీలో లేకుంటే ముషీరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ తనకు ఇవ్వాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించి ఇప్పటికేనా తనకే బిఫామ్ ఇయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి పూసరాజు, ఎమ్మెల్యే విశ్వనాథ్‌జీ, కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: ముషీరాబాద్‌లో బీజేపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజవర్గ బీజేపీ అభ్యర్థి పూసరాజు అన్నారు. మంగళవార రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో బీజేపీకి ఓటు బ్యాంకు ఉందని దానిని సద్వినియోగం చేసుకొని రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే విశ్వనాథ్‌జీ, కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేరామ్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు వీఎస్టీ రాజు, మహమూద్, డిఎస్ రెడ్డి, జయందర్‌బాబు, బి.యాదగిరిగౌడ్, టి.గోపాల్, ఉమేష్, శ్రీకాంత్, మోహన్, మహిళా మోర్చా నాయకురాలు తులసి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి యాదగిరి గౌడ్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న యాదగిరిగౌడ్

చిక్కడపల్లి: బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా గీతసెల్ కో కన్వీనర్ బి.యాదగిరిగౌడ్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం రాజీనామా లేఖను పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గాంధీనగర్‌తో పాటు నియోజవర్గంలోని అన్ని డివిజన్లలో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేశానన్నారు. సీనియర్‌నైన తనకు ఎలాంటి గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తనకు నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించలేదని ఆరోపించారు. అందుకే బీజేపీకి రాజీనామా చేశానని తనతోపాటు అనేక మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కూడా రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

టీడీపీకి అడప చంద్రమౌళి రాజీనామా



కృష్ణ యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్ అడప చంద్రమౌళి

నల్లకుంట: టీడీపీ సీనియర్ నేత, విద్యానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అడప చంద్రమౌళి, తెలుగు యువత నగర ఉపాధ్యక్షుడు అడప జనార్దన్, రాష్ట్ర మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులతో కలిసి ఆ పార్టీ సభ్యత్వానికి, పార్టీ రాజీనామా చేశారు. అనంతరం మాజీ మంత్రి, అంబర్‌పేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి. కృష్ణా యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. మంగళవారం నల్లకుంటలో అడప చంద్రమౌళి మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడం లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించడం బాధాకరమన్నారు. ప్రధాని మోదీ పనితీరు, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులమైన తాను అనుచరులతో కలిసి బీజేపీలో చేరినట్లు తెలిపారు. అంబర్‌పేటలో బీజేపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

కులవృత్తిదారులకు ప్రాధాన్యం



నాయిబ్రాహ్మణులను పార్టీలోకి ఆహ్వానించిన ముఠా జైసింహ

ముషీరాబాద్: కులవృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని పార్టీ యువజన నాయకుడు ముఠా జైసింహ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ముఠా జైసింహ మాట్లాడుతూ సెలూన్లకు 250 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించడంతో పాటు పాటు అబ్దుల్లాపూర్‌మెట్‌లో రెండు ఎకరాల స్థలం, భవన నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. సంఘం సలహాదారు మనోహర్, నాయకులు నరేష్, శ్రీకాంత్, మల్లికార్జున్, రవి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, గ్రేటర్ సీనియర్ నాయకుడు టి.సోమన్, నాయకులు టెంట్ హౌజ్ శ్రీనివాస్, బల్ల ప్రశాంత్, భిక్షపతియాదవ్, అజయ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన టిక్‌టాక్ సాయియాదవ్...

ముషీరాబాద్‌కు చెందిన టిక్‌టాక్ సాయియాదవ్ బీఆర్ఎస్‌లో చేరారు. భరత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. నియోజవర్గంలో రూ.1100 కోట్లతో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి ఆశీర్వదదించాలని కోరారు. కార్యక్రమంలో ముఠాజైసింహ, పాకాల శ్రీకాంత్ యాదవ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బ్యాంకింగ్ సహా వివిధ రంగాల్లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో యువతీ, యువకులకు ఉచితంగా వంద రోజుల శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సూర్యనగర్ బస్తీలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్‌లో బేసిక్స్ ఆఫ్ అకౌంటింగ్, మ్యూచువల్ ఫండ్స్, బీపీవో, ఎంఎస్ ఆఫీస్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ తదితర అంశాల్లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇందు కోసం 10, ఇంటర్, డిగ్రీ, పూర్తి చేసిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, పేర్ల నమోదుకు 96407 35115 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముషీరాబాద్‌లో హ్యాట్రిక్ సాధిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, నాయకులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజకవర్గంలో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తానని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ ధీమా వ్యక్తం చే శారు. మంగళవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్శితులై వివిధ వర్గాలు, పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ముషీరాబాద్ నియోజవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు.సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ముఠారపు రాకేష్‌కుమార్, జి. పరుశురామ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పాశంరవి, పున్న సత్యనారాయణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పుట్టా లక్ష్మణ్

ముషీరాబాద్: హైదరాబాద్ జిల్లా మేదర సంఘం ప్రధాన కార్యదర్శి, సీనియర్ అడ్వకేట్ పుట్టా లక్ష్మణ్ మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంతకు ముందు రాంనగర్ డివిజన్ శాస్త్రీనగర్ పోచమ్మ దేవాలయం నుంచి ర్యాలీగా గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. పార్టీలో చేరిన వారిలో చిలక శంకర్, సయ్యద్ గౌస్, పుట్టా వెంకటస్వామి, శ్రీనివాస్, సాయికుమార్, కార్తికేయ, పరమేష్, దీన్‌దయాల్‌రెడ్డి, రజనీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీసీ నేతల ప్రచారం

చిక్కడపల్లి: ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ గెలిపించాలని కోరుతూ బీసీ సంఘం నేతలు మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లో విసస్తృతంగా ప్రచారం చేశారు. బీసీ చైతన్య సమితి ముషీరాబాద్ అధ్యక్షుడు బోసం అన్ని నేతృత్వంలో గాంధీనగర్, జవహర్‌నగర్, ఎస్ఆర్‌టి, క్వార్టర్స్ ప్రాంతాల్లో బీసీ ఓటర్లను కలిసి బీసీల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న బీసీ నేత ముఠాగోపాల్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌మోహన్, మెరుగు శ్రావణ్‌కుమార్, నవీన్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం



విజయ(ఫైల్)



చిన్నారులు కృప, పాల్(ఫైల్)

నల్లకుంట: ఇద్దరు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చి ంది. ఎస్సై కె. రమాదేవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తల్లపోగు క్రాంతి, విజయ(30) దంపతులు నల్లకుంట టీఆర్టీ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం. కుటుంబ సమస్యల కారణంగా విజయ సోమవారం ఉదయం తన కుమార్తె కృప(10), కుమారుడు పాల్(7)లను తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకి లభించలేదు.దీంతో విజయ తండ్రి సులిక్షాల శ్రీను మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం



పాలమూరు బస్తీలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ఎక్కడ లేని సంక్షేమం, అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని పాలమూరు బస్తీలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని గులాబీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని పార్కులను సుందరంగా తీర్చిదిద్దడానికి రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రావుల మోజెస్, ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టేడి నర్సింహారెడ్డి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఉద్యమకారుడు చిట్టేడి నర్సింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తిస్తామని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదన్నారు. ఉద్యమకారుల నమ్మకాన్ని కేసీఆర్ వమ్ము చేశారన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీపై విమర్శలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు తమతో పాటు ఉద్యమకారులంతా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి సమక్షంలో రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కెపి మురళీకృష్ణ, ఆర్.నర్సింగ్ రావు, ఖాజా మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన పార్టీ అభ్యర్థులను గెలిపించండి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో దళిత బహుజన పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. మంగళవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఓడించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధన దళిత బహుజన పార్టీతోనే సాధ్యమన్నారు. డాక్టర్ వివిఎల్ రాజు, బొడుసు మహేష్ యాదవ్, సి.శ్యామ్‌కుమార్, మద్దెల ప్రవీణ్ కుమార్, ఎ.రాజు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్

కాచిగూడ: బీజేపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అంబర్‌పేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో గోల్నాక డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కలిసి కట్టుగా పనిచేసి అంబర్‌పేటలో బీజేపీని గెలిపించాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిలోకి దూసుకెళుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్ గౌడ్, సి.కృష్ణగౌడ్, ఎం.శ్యామ్ రావు, కేసరి నర్సింగ్ యాదవ్, కత్తుల సుదర్శన్, ఆర్‌కె రాంచందర్, మహ్మద్ సలీం ఖాజా, పి.రంగారావు, ఆర్‌వివిఎల్ రమేష్, కె.రవీందర్, దామోదర్ నాయుడు, కె.శ్రీనివాస్ రెడ్డి, కె.శోభా చందర్, ఎస్.శ్రీధర్ గౌడ్, కె.సునిల్‌కుమార్, ఎస్.రాజేశ్, ఈశ్వర రావు, సావిత్ర, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



రాంనగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని ఫరా ఆసుపత్రి, దయార మార్కెట్, హరినగర్, ఉదయ్‌నగర్, పవిత్రనగర్, జెమిని కాలనీ, మేదర బస్తీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీ స్కీమ్‌లను వివరించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన పార్టీని అధికారంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, బి-బ్లాక్ అధ్యక్షులు అంజియాదవ్, రామానంద్‌రెడ్డి, హంజద్‌హుస్సేన్, మోహన్ దాస్, కిరణ్, వాజీద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం



ముషీరాబాద్: ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు విజయం కోసం రూపొందించిన ఎన్నికల ప్రచార రథాలను పార్టీ అభ్యర్థి పూస రాజు మంగళవారం ప్రారంభించారు. ప్రతి డివిజన్‌లో బీజేపీ పాటలు, మాటలతో ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలకోట అరుణ్‌కుమార్, వినయ్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, పార్థసారధి, వేణుగోపాల్, రాజ్‌కుమార్, శక్తిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్తులపై అధిష్టానం నజర్

- కేటీఆర్‌తో వి.శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబుయాదవ్ భేటీ
- అలకవీడని ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు.



మంత్రి కేటీఆర్‌తో వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల హరిబాబుయాదవ్, ఎంఎస్ ప్రభాకర్, కన్నా యాదవ్

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నా ముషీరాబాద్ నియోజకవర్గంలోని కొందరు బీఆర్ఎస్ నేతలు గడప దాటకపోవడంపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించిన ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్, కన్నాయాదవ్‌లు పలుమార్లు అసంతృప్త నేతలతో మాట్లాడినప్పటికి ఫలితం లేకపోవడంతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. అలకబూనిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, నాయిని నర్సింహారెడ్డి అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డిలతో మంగళవారం ఆయన అరగంటకుపైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల కాలంలో తాము ఎదుర్కొన్న సమస్యలను వారు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కేటీఆర్ కూడా నేరుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడి అందరినీ కలుపుకోవాలని, మొదటి నుంచి పని చేస్తున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనందున అతి విశ్వాసం పనికి రాదని సీనియర్లు, జూనియర్‌లను సమన్వయం చేసుకోవాలని ముఠా గోపాల్‌కు చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో సీనియర్ నేతలను కోఆర్డినేషన్ చేయడానికి పార్టీ సీనియర్ నాయకుడు కర్నెప్రభాకర్‌కు నియమించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కేటీఆర్ సూచన మేరకు పార్టీ అభ్యర్థి విజయం కోసం తాము కలిసి పని చేస్తామని వి.శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబుయాదవ్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

అలకవీడని ఎంఎన్ శ్రీనివాస్‌రావు....

కేటీఆర్ సమావేశం విషయమై ఎంఎస్ ప్రభాకర్ ఎంఎన్ శ్రీనివాస్‌రావుకు తెలపగా తనకు ముందే నిర్ణయించుకున్న పని ఉందని చెప్పి సమావేశానికి గైర్హాజరయ్యారు. కర్నె ప్రభాకర్ మంగళవారం రాత్రి ఎంఎన్ శ్రీనివాస్‌రావు ఇంటికి ఎలక్షన్ ఇన్‌చార్జీలతో కలిసి వచ్చి మాట్లాడారు. అయితే ఎంఎన్ శ్రీనివాస్‌రావు మెత్తబడతారా...? లేక పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటారా? అనేది వేచి చూడాల్సిందే.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కాచిగూడ: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ఎన్. రామలక్ష్మణ రాజు ఆధ్వర్యంలో కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, పారామిలటరీ బలగాలతో కలిసి నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నింబోలిఅడ్డ, కాచిగూడ ఓల్డ్ ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు, సుందర్ నగర్, క్రిష్ణానగర్, అక్వాకేఫ్, గోల్నాక, గోల్నాక మార్కెట్, తిలక్‌నగర్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్, బర్కత్‌పుర చమన్, శాలిని హాస్పిటల్ , రాఘవేంద్ర స్వామి టెంపుల్, లింగంపల్లి ఎక్స్‌రోడ్స్, చెప్పల్‌బజార్, హరిమజీద్, మోతీమార్కెట్, చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్స్, ఆర్ కేడీయా కాలేజ్, కాచిగూడ ఓల్డ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మీదుగా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది.



రోహిణ్ రెడ్డి విజయం ఖాయం

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి విజయం ఖాయమని పార్టీ ఫిషర్‌మెన్ విభాగం రాష్ట్ర చైర్మన్ సత్యనారాయణ గంగపుత్ర అన్నారు. మంగళవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అంబర్‌పేట ప్రజలకు చేసిందేమీ లేదని, కేవలం స్వలాభం కోసమే రెండు పార్టీలు చీకటి ఒప్పందం కుదుర్చుకొని అంబర్‌పేట అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించాడు. రోహిణ్ రెడ్డిని భారీ మెజార్టీలో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు.